సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 6 । డిసెంబర్ । 2024



క్యూల్లో బారులుతీరిన భక్తులు





భక్తజన కల్పవల్లి

కనకమహాలక్ష్మి.. కరుణించవమ్మ

- వైభవంగా మొదటి గురువారం పూజలు
- అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో తొలి గురువారం పూజలు వైభవంగా జరిగాయి. ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, సిరులతల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. వేద మంత్రాలు, నాదస్వరాల మధ్య గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరణాలు, వేద పారాయణాలు, శ్రీచక్రార్చన, లక్ష్మీ హోమం, విశేష పూజలు చేశారు. పసుపు కుంకుమ నీళ్లతో అమ్మవారికి అభిషేకం జరిపారు. తర్వాత క్షీరాభిషేకం నిర్వహించి, పసుపు పూశారు. అమ్మవారికి స్వర్ణాభరణ అలంకరణ చేసి.. భక్తులకు దర్శనం కల్పించారు.



చల్లగా చూడమ్మా..

సాధారణంగా సంతానం లేని వారు, సంతానం కలగాలని అమ్మవార్లను మొక్కుతారు. సంతానం కలిగితే అమ్మవారి పేరు పెట్టుకుంటామని మనస్సులో అనుకుంటారు. అలాగే పిల్లలు ఆరోగ్యంగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా తల్లి కరుణ ఉండాలని మనస్ఫూర్తిగా దండం పెడతారు. ఇదే కోవలో ఓ తండ్రి తన బిడ్డను అమ్మవారి ఒడిలో పెట్టి 'నా చిన్నారికి ఎటువంటి కష్టం లేకుండా చూడమ్మా' అంటూ పూజించారు. మార్గశిర మాసంలో వచ్చే గురువారాల్లో ఎక్కువ మంది భక్తులు తమ పిల్లలను ఇలా అమ్మవారికి చూపించడం ఆనవాయితీ.



అమ్మవారి ప్రధాన ఆలయం నుంచి రీడింగ్ రూమ్ వరకు భక్తుల సందడి





సీఎం వస్తున్నారనీ...

పార్టీ కార్యాలయానికి రోడ్డు నిర్మాణం

అసలే ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తున్నారు.. అది కూడా రామ్‌నగర్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి.. ఇంకేముంది.. జీవీఎంసీ అధికారులు స్వామి భక్తిని చాటుకోవాలని తెగ తాపత్రయపడిపోయారు. హడావుడిగా అంచనాలు వేసేసి.. కాంట్రాక్టును అప్పగించేసి.. అనుకున్నదే తడవుగా కొత్తరోడ్డు నిర్మించేశారు. టీడీపీ కార్యాలయానికి వెళ్లే రోడ్డు కంటే దారుణంగా నగరంలో పలు రోడ్లు ఇటీవల కురిసిన వర్షాలకు ధ్వంసమయ్యాయి. వాటిని బాగుచేయాలని నగర ప్రజలు వినతులు అందించినా జీవీఎంసీ అధికారులు పట్టించుకోలేదు. కానీ ఒక్క పూటలోనే నగర టీడీపీ కార్యాలయానికి అద్దంలా మెరిసే రోడ్డు వేసి.. అధికార పార్టీకి చెందిన నేతల నుంచి మార్కులు కొట్టేయడానికి ప్రయత్నించడం విశేషం.

– సాక్షి, విశాఖపట్నం

సీఎం చంద్రబాబుకు స్వాగతం



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: సీఎం చంద్రబాబు గురువారం రాత్రి నగరానికి చేరుకున్నారు. ఎయిర్‌పోర్ట్ నుంచి నేరుగా రాంనగర్‌లోని ఎన్టీఆర్ భవనానికి చేరుకున్నారు. అక్కడే రాత్రి బస చేశారు. శుక్రవారం ఉదయం 9.25 గంటలను ఎన్టీఆర్ భవన్ నుంచి రోడ్డు మార్గం ద్వారా నోవాటెల్ హోటల్‌కు చేరుకుని సాయంత్రం 6 గంటల వరకు డీప్ టెక్ సదస్సులో పాల్గొని ప్రసంగించనున్నారు. సాయంత్రం 6.15కు అక్కడ నుంచి నేరుగా విమానాశ్రయానికి చేరుకుని విజయవాడ పయనమవుతారని అధికారులు తెలిపారు. అంతకుముందు విమానాశ్రయంలో ముఖ్యమంత్రికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్, విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి, జేసీ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్, తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లాలో శుక్రవారం నుంచి వచ్చే ఏడాది జనవరి 8వ తేదీ వరకు జరిగే రెవెన్యూ సదస్సులకు అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై కలెక్టరేట్‌లో గురువారం జిల్లా స్థాయి సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సదస్సుల్లో అందించే సేవలకు ప్రజలు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. రెవెన్యూ సంబంధిత సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించడమే లక్ష్యంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సీఎంవో, ఎమ్మెల్యేలు, జిల్లా కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన అర్జీలను పూర్తిస్థాయిలో సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలన్నారు. అటవీ, దేవదాయ, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ శాఖల అధికారులు భూములకు సంబంధించిన పూర్తి రికార్డులతో సదస్సులకు హాజరుకావాలన్నారు. వచ్చిన దరఖాస్తులను ఏరోజుకారోజు ఆన్‌లైన్ నమోదు చేయాలని సూచించారు. సమీక్షలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పి.వి.జి.ఆర్ నాయుడు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేష్ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, జేసీ మయూర్ అశోక్, **డీఆర్వో** భవానీ శంకర్, ఆర్డీవోలు శ్రీలేఖ, సంగీత్ **మాథూర్** తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం

జిల్లాలోని 595 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ **నెల 7న** మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ **సమావేశం** నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర **ప్రసాద్** తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులకు మరింత మెరుగైన విద్యను అందించేందుకు తల్లిదండ్రుల నుంచి ఈ సమావేశంలో సూచనలు స్వీకరిస్తామన్నారు. పిల్లల చదువు, ప్రవర్తన, క్రమశిక్షణ గురించి తల్లిదండ్రులు తెలుసుకోవచ్చన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ఈ జైలుకు ఏమైంది?



ఆరిలోవ: ప్రశాంత వాతావరణంలో ఏర్పాటు చేసిన విశాఖ కేంద్ర కారాగారం వివాదాస్పద ఘటనలతో తరచూ వార్తల్లో నిలుస్తోంది. నిత్యం ఏదో ఒక సంఘటనతో జైళ్ల శాఖ ఉన్నతాధికారుల దృష్టిలో పడుతోంది. ఇటీవల జరిగిన ఘటనలపై రాష్ట్ర జైళ్ల శాఖ డీఐజీ స్థాయి అధికారి దర్యాప్తు చేపట్టి.. ఇక్క డ నుంచి బదిలీపై వెళ్లిన ఇద్దరు ఉన్నతాధికారుల పాత్ర ఉందని తేల్చారు. దర్యాప్తులో వెల్లడైన నిజాలు ఆధారంగా రాష్ట్ర హోం శాఖ వారిని సస్పెండ్ చేసింది. ఉన్నతాధికారులపై వేటు పడటంతో కిందిస్థాయి సిబ్బందిలో ఆందోళన నెలకొంది. దీంతో కేంద్ర కారాగారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అసలు జైలులో ఏం జరుగుతోంది? అనే ప్రశ్న అందరినీ వేధిస్తోంది.

ఖైదీ ఆత్మహత్య

ఈ ఏడాది జూలై 30న జైలు గోదావరి బేరక్‌లోని బాత్ రూం వెంటలేటర్‌కు ఉప్పాడ గౌరీ శంకర్(25) అనే శిక్ష పడిన ఖైదీ ఆత్మహత్య చేసుకున్నాడు. పర్యవేక్షణ చేయాల్సిన అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ఉన్నతాధికారులు చేపట్టిన దర్యాప్తులో తేలింది. ఇక జైలు లోపల ఖైదీలకు గంజాయితో పాటు బీడీలు సరఫరా జరుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఇందుకు ఇటీవల జరిగిన ఘటనే నిదర్శనం. జైలు ఫార్మాసిస్ట్ తన లంచ్ బాక్స్‌లో గంజాయి తీసుకెళ్తూ పట్టుబడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ఘటన కూడా ఇద్దరు అధికారుల సస్పెన్షన్‌కు కారణంగా తెలుస్తోంది. ఫార్మాసిస్ట్ గతేడాది నుంచి ఇద్దరు ఖైదీలకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఆయనపై అధికారులు ఉదాసీనత ప్రదర్శించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గ్రూపుల గోల


బదిలీపై అనంతపురం కారాగారానికి సూపరింటెండెంట్‌గా వెళ్లిన కిశోర్‌కుమార్, నెల్లూరు జైలుకు అదనపు సూపరింటెండెంట్‌గా బదిలీపై వెళ్లిన వెంకటేశ్వరరావు విశాఖ జైలులో రెండు గ్రూపులు నిర్వహించినట్లు తెలిసింది. ఒక్కో గ్రూపు సిబ్బంది ద్వారా అనుకూలమైన ఖైదీలకు సపర్యలు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గంజాయి సరఫరా చేసిన ఫార్మాసిస్ట్‌కు ఇద్దరు అధికారులు సహకరించినట్లు సమాచారం. ఇక్కడ గ్రూపులు ఉన్నట్లు గుర్తించిన జైళ్ల శాఖ ఉన్నతాధికారులు.. ఇద్దరిపై ఒకేసారి బదిలీ వేటు వేసినట్లు సమాచారం.

యథేచ్ఛగా మొబైల్ వినియోగం

జైలు నిబంధనల ప్రకారం కారాగారం **లోపల** మొబైల్ ఫోన్ల వాడకం పూర్తిగా నిషే**ధం. అధికారులు**, సిబ్బంది కూడా విధుల **సమయంలో** మొబైల్ ఫోన్లను ఉపయోగిం**చకూడదు.** అత్యవసర అవసరాల కోసం అధి**కారులు** తమ కార్యాలయాల్లో మాత్రమే **ఫోన్లను ఉ**పయోగించుకోవచ్చు. అయితే అధి**కారులు,** సిబ్బంది ఈ నిబంధనలను ఉల్లం**ఘిస్తూ జై**లు లోపల విచ్చలవిడిగా మొబైల్ **ఫోన్లను ఉ**పయోగిస్తున్నట్లు జైళ్ల శాఖ ఉన్న**తాధికారుల** దర్యాప్తులో తేలింది. గత జైలు **సూపరింటెం**డెంట్, అదనపు సూపరింటెండెం**ట్‌లు సెల్‌**ఫోన్లు వినియోగించినట్లు తమ నివే**దికలో** పేర్కొన్నారు. వారి మొబైల్ ఫోన్ల నుంచి **రాత్రు**ళ్లు కొందరు ఖైదీలు బయట **వ్యక్తులతో** మాట్లాడినట్లు గుర్తించారు. ఏసీబీ దాడుల్లో పట్టుబడిన అధికారులు, ఎవరైనా రాజకీయ నాయకులు రిమాండ్‌కు వస్తే ఇక్కడి అధికారులు, సిబ్బందికి పండగే.! అలాంటి వారికి సపర్యలు చేస్తూ.. కుటుంబ సభ్యులు, అవసరమైనవారితో తమ సెల్‌ఫోన్ల నుంచి మాట్లాడిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం వారి నుంచి రూ.లక్షల్లో దండుకుంటున్నారని తెలిసింది. కింది స్థాయి సిబ్బంది కూడా మొబైల్ ఫోన్లను యథేచ్ఛగా ఉపయోగిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.







మాస్ జాతర

- థియేటర్ల వద్ద అభిమానుల కోలాహలం
- సినిమా బ్లాక్‌బాస్టర్‌తో బాణసంచా కాల్చివేత
- తొలిరోజు 36 థియేటర్లలో 239 షోల ప్రదర్శన
- ఒక్క రోజులోనే రూ.3.5 కోట్లకు పైగా కలెక్షన్లు

నగరంలో 'పుష్ప–2 ది రూల్' మేనియా ఊపేస్తోంది. బుధవారం రాత్రి పలు థియేటర్లలో బెనిఫిట్ షోలు ప్రదర్శించారు. టికెట్ ధరలు పెంచినప్పటికీ తగ్గేదేలే అన్నట్లు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఫ్యాన్స్ థియేటర్లకు పోటెత్తారు. పూనకాలతో ఊగిపోయారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి నగరంలో అన్ని థియేటర్లలోను పుష్ప–2 సినిమా రూల్ చేసిందంటే అతిశయోక్తి కాదు. థియేటర్లలో అన్ని స్క్రీన్లు హౌస్‌ఫుల్ కలెక్షన్లు రాబట్టాయి. సినిమా బ్లాక్ బస్టర్ అవడంతో థియేటర్ల వద్ద పండగ వాతావరణం కనిపించింది. – విశాఖ సిటీ

రికార్డులు బద్దలు కొడుతుంది

పుష్ప–2 అన్ని రికార్డులు తిరగరాస్తుంది. అందులో డౌట్ లేదు. ప్రతి సీన్ అద్భుతంగా ఉంది. ముఖ్యంగా ఇంటర్వెల్‌కు ముందు సీన్, క్లైమాక్స్ ఫైట్ సూపర్. మూడు గంటలకు పైగా సినిమా ఉన్నప్పటికీ.. ఎటువంటి బోర్ లేకుండా స్క్రీన్‌ప్లేను నడిపించారు.

– వినీష్, విశాఖ



239 షోలు

విశాఖలో 36 సినిమా థియేటర్లు ఉన్నాయి. బుధవారం రాత్రి బెనిఫిట్ షో తర్వాత నుంచి వరుస షోలు ప్రదర్శించారు. మునుపెన్నడూ లేని విధంగా అర్ధరాత్రి 2 గంటలు, ఉదయం 5, 6 గంటలకు కూడా థియేటర్లలో స్క్రీనింగ్‌లు జరిగాయి. ఐనాక్స్‌లు, సినీపోలీస్, ముక్తాస్ స్క్రీన్లలోనే కాకుండా అన్ని సాధారణ థియేటర్లలో పుష్ప–2 హవా కొనసాగింది. తొలి రోజు 239 షోలతో పుష్ప–2 రూల్ చేయడం విశేషం.

బెనిఫిట్ షోల్లో ఫ్యాన్స్ కోలాహలం

బుధవారం రాత్రే పలు థియేటర్లలో బెనిఫిట్ షోలు ప్రదర్శించారు. ఈ షోలకు కూడా భారీ సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. దీంతో థియేటర్ల వద్ద పుష్ప ఫీవర్ స్పష్టంగా కనిపించింది. షో ప్రారంభానికి ముందే థియేటర్ల వద్ద ఏర్పాటు చేసిన కటౌట్లకు పూజలు, క్షీరాభిషేకాలు చేశారు. సంగం శరత్, రామాటాకీస్ థియేటర్ల వద్ద భారీ కటౌట్లు ఏర్పాటు చేశారు. ఏనుగుల విగ్రహాలు పెట్టి దాని మీద పుష్ప–2 సినిమాలో అల్లు అర్జున్ వేషధారణతో విగ్రహాన్ని ప్రదర్శించారు. సంగం, శరత్ థియేటర్ ఎదురుగా ఉన్న తెలుగుతల్లి ఫ్లై ఓవర్ ఎక్కి పుష్ప–2 భారీ పోస్టర్‌ను ప్రదర్శించారు. దానికి పూలు వేసి పూజలు చేశారు. థియేటర్లలో సినిమా ఆద్యంతం కేరింతలు కొట్టారు. స్క్రీన్ల ముందు వెళ్లి డ్యాన్సులు, పూనకాలతో ఊగిపోయారు. సినిమా అభిమానుల అంచనాలకు మించి ఉండడంతో ఇంక వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. థియేటర్ల వద్ద అభిమానులు టపాసులు కాల్చి, స్వీట్లు తినిపించుకున్నారు.

తొలి రోజు రూ.3.5 కోట్లకు పైగా కలెక్షన్లు

బెనిఫిట్ షోను పక్కనపెడితే.. గురువారం ఒక్క రోజు విశాఖలో 'పుష్ప–2' రూ.3.5 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టినట్లు సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఆన్‌లైన్‌లోనే అత్యధికంగా అడ్వాన్స్ బుకింగ్ ద్వారా టికెట్ల విక్రయాలు జరిగినట్లు తెలుస్తోంది. బుక్ మై షో, ఐనాక్స్, ముక్తాస్, పేటీఎం.. ఇలా ఆన్‌లైన్ బుకింగ్ ప్లాట్‌ఫాంల ద్వారా 85 శాతం టికెట్ల అమ్మకాలు జరిగినట్లు ఆయా సంస్థలు ప్రకటించాయి. రెండో రోజు కూడా ఇదే క్రేజ్ కనిపిస్తోంది. ఈ వీకెండ్ నాటికి ఈ సినిమా విశాఖ నుంచే రూ.10 నుంచి రూ.12 కోట్ల మేర గ్రాస్ రాబట్టే అవకాశం ఉందని అంచనా.



సినిమా అదిరింది

సినిమా అదిరిపోయింది. అల్లు అర్జున్ నటనతో పిచ్చెక్కించాడు. మరోసారి జాతీయ అవార్డు రావడం ఖాయం. బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ మరో లెవెల్‌లో ఉంది. సినిమా ఆలస్యమైనప్పటికీ.. డైరెక్టర్ సుకుమార్ అభిమానులకు మంచి ఫీస్ట్ ఇచ్చాడు.

– మణిసుందరి, విశాఖ

దళారుల ప్రమేయం లేకుండా

ధాన్యం కొనుగోలు

- అవసరం అయితే పీడీ యాక్టు
- జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- మంత్రి నాదెండ్ల మనోహర్



మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

మహారాణిపేట: ధాన్యం కొనుగోలు ప్రక్రియలో దళారుల ప్రమేయం లేకుండా చూడాలని, రైతులకు అన్ని విధాలుగా అండగా నిలవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఉత్తరాంధ్రలోని జాయింట్ కలెక్టర్లు, సివిల్ సప్లై, లీగల్ మెట్రాలజీ, విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులతో జరిగిన ప్రాంతీయ సదస్సులో వివిధ అంశాలపై దిశానిర్దేశం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ అత్యంత సజావుగా, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, సాంకేతిక సహాయాన్ని తీసుకోవాలని సూచించారు. బుకింగ్ దగ్గర నుంచి కొనుగోలు ముగిసే వరకు రైతులకు ప్రతి విషయం తెలియపరచాలని, 48 గంటల లోపే రైతు ఖాతాలో నగదు జమ చేయాలన్నారు. జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని, రైతులు, అధికారులతో కూడిన కమిటీని నియమించుకోవాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమించే వారిపై కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. 6ఏ కేసులు నమోదు చేయటంతో పాటు పీడీ యాక్ట్‌ను ప్రయోగించాలని సూచించారు. దీపం–2 పథకంపై అధికారులు మరింత ఫోకస్ పెట్టాలని పేర్కొన్నారు. గ్యాస్ బుకింగ్, డెలివరీ ప్రక్రియలో జాప్యం జరగకుండా చూడాలని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ వీర పాండియన్, ఎండీ మంజిల్ జిలానీ, విశాఖ జేసీ కె.మయూర్ అశోక్, అనకాపల్లి జేసీ జాహ్నవి, విజయనగరం జేసీ సేతుమాధవన్, మన్యం జేసీ శోభిక, అల్లూరి జేసీ అభిషేక్, శ్రీకాకుళం జేసీ ఫర్మన్ అహ్మద్‌ఖాన్, ఉత్తరాంధ్ర జిల్లాల సివిల్ సప్లై, లీగల్ మెట్రాలజీ, విజిలెన్స్, వ్యవసాయ శాఖ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎంఎస్‌ఎంఈ ప్రొక్యూర్‌మెంట్ సదస్సు

మహారాణిపేట: గీతం వర్సిటీలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్‌ఎంఈ) ప్రొక్యూర్‌మెంట్ సదస్సును నిర్వహిస్తున్నారు. సీఐఐ, ఎంఎస్‌ఎంఈలు సంయుక్తంగా మార్కెటింగ్‌కు సంబంధించి ప్రొక్యూర్‌మెంట్/వెండర్ డెవలప్‌మెంట్ కోసం ఈ సదస్సును ఏర్పాటు చేశాయి. ఆటోమొబైల్, ఆహార శుద్ధి, స్టీల్, అల్లాయ్స్, రక్షణ రంగాలకు చెందిన ఉత్పత్తులను ప్రదర్శించానికి ఆసక్తి ఉన్న ఎంఎస్‌ఎంఈలు ఉచితంగా స్టాల్‌ను ఏర్పాటు చేయవచ్చని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు తెలిపారు. రాష్ట్ర చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సదస్సును ప్రారంభిస్తారని, మరిన్ని వివరాలకు చందన్(సీఐఐ-99854 00782)ను సంప్రదించవచ్చని ఆదిశేషు పేర్కొన్నారు.

హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ తప్పనిసరి

గోపాలపట్నం: హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు లేకుండా డీలర్లు నూతన వాహనాలను డెలివరీ చేయవద్దని ఉపరవాణా కమిషనర్ జి.ఆదినారాయణ సూచించారు. మోటార్ వాహన చట్టం సెక్షన్ 41(6) ప్రకారం కొత్త వాహనాలు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు లేకుండా రోడ్లపై తిరగడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ 2024 నవంబర్ 22న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ప్రతి కొత్త వాహనం హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్‌తోనే ఉండాలని, ఈ నిబంధనలు అతిక్రమించిన వాహనాలపై కేసులు నమోదు చేస్తామ ని హెచ్చరించారు. ఈ ప్లేట్ల ఖర్చును వాహన ధరలో భాగంగానే వసూలు చేసుకోవాలని డీలర్లకు సూచించారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై 7న ప్రతిజ్ఞ

డాబాగార్డెన్స్: వచ్చే ఏడాది జనవరి ఒకటి నుంచి నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 7న ఉదయం 6.30 గంటలకు ఆర్.కె.బీచ్‌లో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విశాఖ స్వచ్ఛ అంబాసిడర్, సినీ సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో నగర ప్రజలు పాల్గొని, ప్లాస్టిక్ రహిత విశాఖ కోసం ప్రతిజ్ఞ చేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

'రింగు వలలతో చేపల వేట నిషేధం'

మహారాణిపేట: జిల్లాలో రింగు వలలతో చేపల వేట పూర్తిగా నిషేధించినట్లు మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు తెలిపారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం రింగు వలలతో వేట చేయడానికి లైసెన్స్ ఉండాలని స్పష్టం చేశారు. నిబంధనలను అతిక్రమించి రింగు వలలతో వేట చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కనకమహాలక్ష్మి కరుణించవమ్మా..



అమ్మవారి దర్శనానికి క్యూలో వేచి ఉన్న భక్తులు



అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో తొలి గురువారం పూజలు వైభవంగా జరిగాయి. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 12.05 నుంచి 1.30 గంటల వరకు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వెండి కవచాలు తొడిగారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో కె శోభారాణి, ఏఈవో కె తిరుమలేశ్వరరావు, వేదపండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దర్శనాలు ఇలా..

టౌన్‌కొత్తరోడ్డు నుంచి క్యూలు ఏర్పాటు చేశారు. రీడింగ్ రూమ్ వద్ద ధర్మ దర్శనంతో పాటు రూ.100 ప్రత్యేక దర్శనం, రూ.200 శీఘ్ర దర్శనం, రూ.500 మార్గశిర విశిష్ట దర్శనం కల్పించారు. సీతారామస్వామి ఆలయం వైపు నుంచి వీవీఐపీ, వీఐపీతో పాటు వృద్ధులు, వికలాంగులు, చిన్న పిల్లల తల్లులను పంపించారు. అమ్మవారి ఆలయ వెనుకభాగం, ఆలయ ప్రధాన ద్వారం కార్యాలయం ఎదురుగా, దర్శనం అనంతరం బయటకు వచ్చే మార్గంలో ప్రసాద కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఘోషాస్పత్రి వద్ద అగ్నిమాపక యంత్రం, రీడింగ్ రూమ్ వద్ద మొబైల్ టాయిలెట్లను అందుబాటులో ఉంచారు. ఆలయానికి సమీపంలో పోలీస్ అవుట్‌పోస్ట్‌తో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ మంచినీటి సదుపాయం కల్పించారు. పలు స్వచ్ఛంద సంస్థలు ఉచిత ప్రసాదం అందజేశాయి. అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఐదు వేల మందికి అన్నదానం

ఉత్సవాల్లో భాగంగా టౌన్‌కొత్తరోడ్డు సమీపంలోని జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి భక్తులు పోటెత్తారు. ఐదువేల మంది భక్తులకు అన్నదానం చేశారు. భక్తుల సౌకర్యార్థం సింహాచలం, మధురవాడ నుంచి రెండు సర్వీసులు నడిపినట్టు ఈవో తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా జగదాంబ జంక్షన్ నుంచి పూర్ణామార్కెట్ మీదుగా పాతపోస్టాఫీస్ వెళ్లే వాహనాలను టౌన్‌కొత్తరోడ్డు, సీబీఎం హైస్కూల్, సూయిజ్‌ఫాం, కురుపాం మార్కెట్ మీదుగా మళ్లించారు. కాన్వెంట్ జంక్షన్, అద్వానీ జంక్షన్, రామకృష్ణ జంక్షన్ మీదుగా వాహనాలను గోపాల్ ఆటో జంక్షన్ మీదుగా మళ్లించారు.

నేటి కార్యక్రమాలు

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, అమ్మవారికి సహస్రనామార్చన, ఉదయం 6 నుంచి 11 గంటల వరకు సర్వ దర్శనం, ఉదయం 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వ దర్శనం, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించనున్నారు.

పోలీసుల తీరుపై విమర్శలు

మార్గశిర మాసం తొలి గురువారం భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు దేవస్థానం పోలీసుల సాయం కోరింది. దీంతో ఆలయం చుట్టూ వందలాది మంది పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే, భక్తులు అక్రమ మార్గాల్లో వెళ్లకుండా నియంత్రించే క్రమంలో కొంతమంది పోలీసులు తమ కుటుంబ సభ్యులను, బంధువులను అనుమతించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అలాగే జనసేన, టీడీపీ చోటా నాయకులు హడావిడి చేస్తూ అంతా తామేనన్నట్లు వ్యవహరించారు. వారి తీరుతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

భారీగా రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: ఖుర్దారోడ్ డివిజన్ భద్రక్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న ప్రీ నాన్ ఇంటర్‌లాకింగ్, నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా ఈ మార్గంలో నడిచే పలు రైళ్లను ఆయా తేదీల్లో రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 12న విశాఖపట్నం-ఢిఘా(22874) ఎక్స్‌ప్రెస్, 13న ఢిఘా-విశాఖపట్నం(22873) ఎక్స్‌ప్రెస్, 10, 17 తేదీల్లో షాలిమర్-విశాఖపట్నం(22853) ఎక్స్‌ప్రెస్, 11, 19వ తేదీల్లో విశాఖపట్నం-షాలిమర్(22854) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు. 14న హౌరా-తిరుపతి(20889) ఎక్స్‌ప్రెస్, 15న తిరుపతి-హౌరా (20890) ఎక్స్‌ప్రెస్, 10, 13, 17వ తేదీల్లో తిరుచ్చిరాపల్లి-హౌరా(12664) ఎక్స్‌ప్రెస్, 12, 15, 19వ తేదీల్లో హౌరా-తిరుచ్చిరాపల్లి(12663) ఎక్స్‌ప్రెస్, 10, 13, 17వ తేదీల్లో సంత్రగచ్చి-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(22807) ఎక్స్‌ప్రెస్, 12, 15, 19వ తేదీల్లో ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-సంత్రగచ్చి(22808) ఎక్స్‌ప్రెస్‌లు రద్దయ్యాయి. 14న కన్యాకుమారి-హౌరా(12666) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 16న హౌరా-కన్యాకుమారి(12665) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, 8, 15వ తేదీల్లో హౌరా-పుదుచ్చేరి(12867) ఎక్స్‌ప్రెస్, 11, 18వ తేదీల్లో పుదుచ్చేరి- హౌరా (12868) ఎక్స్‌ప్రెస్, 15న సంత్రగచ్చి-తిరుపతి(22855) ఎక్స్‌ప్రెస్, 16న తిరుపతి-సంత్రగచ్చి (22856) ఎక్స్‌ప్రెస్, 10, 17వ తేదీల్లో షాలిమర్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(22825) ఎక్స్‌ప్రెస్, 11,18వ తేదీల్లో ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-షాలిమర్(22826) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు డీసీఎం సందీప్ తెలిపారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

పండగల వేళ ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు ఆయా తేదీల్లో అదనపు కోచ్‌లను జతచేస్తున్నారు. సంబల్‌పూర్-ఈరోడ్(08311) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 11 నుంచి 25వ తేదీ వరకు, ఈరోడ్-సంబల్‌పూర్ (08312) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు 13 నుంచి 27 వరకు థర్డ్ ఏసీ, స్లీపర్ క్లాస్ కోచ్‌లను జత చేస్తున్నారు. శ్రీకాకుళం-కొల్లాం(08553) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 8 నుంచి 29వ తేదీ వరకు, కొల్లాం-శ్రీకాకుళం (08554) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు 9 నుంచి 30వ తేదీ వరకు స్లీపర్ క్లాస్ కోచ్‌ను జత చేస్తున్నారు.

వీఎంఆర్‌డీఏ మ్యూజియంల టికెట్ ధరలపై రాయితీ

మహారాణిపేట: కైలాసగిరిపైనున్న తెలుగు మ్యూజియం, వీఎంఆర్‌డీఏ పరిధిలోని మ్యూజియంలలో ప్రవేశానికి విద్యార్థులకు టికెట్ ధరలో రాయితీ ఇవ్వనున్నట్లు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జాయింట్ కమిషనర్ రమేష్ గురువారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. గ్రూపుల వారీ సంబంధిత యాజమాన్యాల నుంచి లేఖ తీసుకొస్తే రాయితీ రేట్లు వర్తింపజేస్తామన్నారు. రివాల్వింగ్ కుర్చీలో కూర్చుని 40 నిముషాలు ఆస్వాదించే లైట్ అండ్ మ్యూజిక్ ప్రదర్శనకు గతంలో ఉన్న రూ.60 రుసుమును రూ.40గా నిర్ణయించామన్నారు. వీఎంఆర్‌డీఏ నిర్వహిస్తున్న అన్ని మ్యూజియంలలో ప్యాకేజీ పద్ధతిలో రాయితీ ధరలు వర్తిస్తాయన్నారు. ప్యాకేజీ-1లో కురుసుర, టీయూ-142, సీ హారియర్, తెలుగు మ్యూజియంలకు రూ.100, ప్యాకేజీ-2లో కురుసుర, టీయూ-142, సీహారియర్‌కు రూ.60, ప్యాకేజీ-3లో తెలుగు మ్యూజియం, టాయ్ ట్రైన్లకు రూ.100 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

తొలిరోజు డీప్‌టెక్ రౌండ్ టేబుల్ సమావేశాలు

నేటి సదస్సుకు ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు

సాక్షి, విశాఖపట్నం: బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో డీప్‌టెక్, గవర్నమెంట్ టెక్నాలజీ ఇన్నోవేషన్ కాంక్లేవ్-2024 గురువారం ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలి రోజున స్టార్టప్స్, ఇన్నోవేటర్స్ డీప్‌టెక్, కృత్రిమ మేథ, మిషన్ లెర్నింగ్ మొదలైన అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశాలు, చర్చా గోష్ఠిలు జరిగాయి. చివరిరోజైన శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరై ఐదేళ్లలో ఏపీ ప్రభుత్వం ఉపయోగించుకోనున్న సాంకేతిక వ్యవస్థలపై ప్రసంగించనున్నారు. గ్లోబల్ ఫోరమ్ ఫర్ సస్టైనబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్(జీఎఫ్ఎస్‌టీ) ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశాల్లో నీతిఆయోగ్, నాస్కామ్, ఎస్‌టీపీఐ, సీఐఐ, సీఎంఎస్, ఫెడరేషన్ ఆఫ్ ఏసియన్ బయోటెక్ అసోసియేషన్ తదితర సంస్థలకు చెందిన ప్రతినిధులు ఏఐ, మెషిన్ లెర్నింగ్ తదితర సాంకేతికతలపై చర్చించారు.

నేటి నుంచి జాతీయ గిరిజన యువ సమ్మేళనం



వివరాలు వెల్లడిస్తున్న గొర్లె మహేశ్వరరావు

ఏయూక్యాంపస్: గీతం వర్సిటీ వేదికగా శుక్రవారం నుంచి 12వ తేదీ వరకు జాతీయ గిరిజన యువ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి విశాఖ జిల్లా యువ అధికారి గొర్లె మహేశ్వరరావు తెలిపారు. నెహ్రూ యువ కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్, కన్కర్, మోహల్లా జిల్లాలు, ఒడిశాలోని కందమల్, కలహండి జిల్లాలకు చెందిన 200 గిరిజన యువతీ యువకులు ఈ సమ్మేళనంలో పాల్గొంటారన్నారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, కేంద్ర యువజన సర్వీసుల క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం సంఘటన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గిరిజన సంస్కృతి, ఆచారాలు, అలవాట్లు, భాష, విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాలపై ఉపన్యాసాలు ఉంటాయన్నారు. ఇందులో భాగంగా రెండు రోజుల పాటు నగరంలోని ప్రముఖ సందర్శనీయ, పర్యాటక స్థలాలు, పరిశ్రమలు, ఆధ్యాత్మిక కేంద్రాలను గిరిజన యువత సందర్శిస్తారన్నారు.

నిందితురాలికి రిమాండ్

అంగన్‌వాడీ కార్యకర్త హత్యాయత్నం కేసు

సీతమ్మధార: అంగన్‌వాడీ కార్యకర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించిన కేసులో నిందితురాలిని గురువారం రిమాండ్‌కు తరలించారు. అక్కయ్యపాలెం శ్రీనివాసనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తగా పనిచేస్తున్న రహీం మనీషా బేగంపై ఆమె స్నేహితురాలు ధూళి సంగీత పెట్రోల్ పోసి నిప్పంటించిన విషయం తెలిసిందే. గోపాలపట్నానికి చెందిన సంగీత తన స్నేహితురాలు అయిన మనీషా బేగంకు ఫిబ్రవరిలో రూ.32 వేలు అప్పు ఇచ్చింది. తర్వాత ఎన్నిసార్లు అడిగినా డబ్బులు ఇవ్వకపోవడంతో ఆమెపై విశ్వాసం కోల్పోయింది. పథకం ప్రకారం బుధవారం మర్రిపాలెంలోని బంక్‌లో రూ.50 పెట్రోల్‌ను డ్రింక్ బాటిల్‌లో నింపుకుంది. దగ్గరలోని కిరాణా దుకాణంలో అగ్గిపెట్టె కొనుగోలు చేసి అక్కయ్యపాలెం చేరుకుంది. డబ్బుల కోసం జరిగిన వాగ్వాదంలో బేగంపై పెట్రోల్ పోసి నిప్పంటించిందని సీఐ విజయకుమార్ తెలిపారు. నిందితురాలిని గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు చెప్పారు. ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పరామర్శించారు. బేగం పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

సర్వసభ్య సమావేశానికి సిద్ధం కండి

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



డాబాగార్డెన్స్: జీవీఎంసీ సర్వసభ్య సమావేశంలో సభ్యులు చర్చించే అంశాలకు సంబంధించి పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 11న జరిగే కౌన్సిల్ సమావేశం అజెండా అంశాలపై గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి.. సభ్యుల సందేహాలకు పూర్తి స్థాయిలో వివరణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఆర్.సోమన్నారాయణ, ప్రధాన ఇంజినీర్ పి.శివప్రసాదరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, డీసీఆర్ ఎస్ శ్రీనివాస్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, జోనల్ కమిషనర్లు, మిగతా శాఖల అధికారులు పాల్గొన్నారు.



• బుల్లెట్ బండెక్కి.. రయ్‌రయ్

మహిళలు బైక్ నడిపితే అందరూ గొప్పగా చూస్తారు. అటువంటిది ఈ మహిళ గురువారం రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై శివాజీపాలెం ప్రాంతంలో రయ్‌రయ్‌మంటూ దూసుకుపోయింది. చీర కట్టుకొని బైక్‌ను నడుపుతున్న ఆమె వైపు అందరూ ఆశ్చర్యంగా చూశారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఏయూ పరీక్షల్లో గందరగోళం

- బీఎస్సీ ఫుడ్ సైన్స్ ప్రశ్నాపత్రంపై అభ్యంతరం
- మళ్లీ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు



ఏయూలోని పరీక్షల విభాగం కార్యాలయం

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీఎస్సీ హానర్స్ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కోర్సు పరీక్ష గందరగోళంగా మారింది. బుధ, గురువారాల్లో బీఎస్సీ హానర్స్ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కోర్సు మూడో సెమిస్టర్ పరీక్ష జరిగింది. అయితే ప్రశ్నాపత్రం తయారీలో తప్పిదాలు చోటు చేసుకున్నాయి. వర్సిటీ నిర్దేశించిన సిలబస్ కాకుండా.. ప్రశ్నాపత్రంలో సిలబస్‌లో లేని ప్రశ్నలు వచ్చాయి. దీంతో పరీక్ష సరిగ్గా రాయలేకపోయామని విద్యార్థులు ఆయా కాలేజీల ప్రిన్సిపాల్స్ దృష్టికి తీసుకురాగా.. వారు ఏయూ అధికారులను సంప్రదించారు. దీనిపై స్పందించిన ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు సంబంధిత ప్రశ్నాపత్రాన్ని పరిశీలించారు. ప్రశ్నాపత్రంలో నిజంగానే సిలబస్‌లో లేని ప్రశ్నలు వచ్చాయా అనేది పరిశీలన చేయాలని సంబంధిత సబ్జెక్టు నిపుణులను ఆదేశించారు. వాటిని పరిశీలించిన పరీక్షల విభాగం అధికారులు అది వాస్తవమేనని తేల్చడంతో వర్సిటీ అధికారులు తేరుకున్నారు. ఈ నెల 4, 5 తేదీల్లో జరిగిన పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. తిరిగి ఈ నెల 12,13 తేదీల్లో మళ్లీ పరీక్ష నిర్వహిస్తామని పరీక్షల విభాగం అధికారులు ప్రకటించారు. విద్యార్థులు ఆ రోజు మళ్లీ పరీక్షకు హాజరై రాయవచ్చన్నారు. సిలబస్ లేకుండా ప్రశ్నాపత్రాలు తయారు చేసి, విద్యార్థులను ఆందోళనకు గురి చేసిన వర్సిటీ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వక్ఫ్ బోర్డు ఆధీనంలోకి జామియా మసీదు



జామియా మసీదు

డాబాగార్డెన్స్: చెంగల్రావుపేటలోని జామియా మసీదు నిర్మాణాలకు బ్రేక్ పడింది. హైకోర్టు, రాష్ట్ర వెల్ఫేర్ బోర్డు ఆదేశాలను అనుసరించి జామియా మసీదు కమిటీని రద్దు చేసినట్లు జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ అహ్మద్ నోటీసులో పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం జామియా మసీదు వద్ద నోటీసును అతికించారు. వక్ఫ్‌బోర్డు ఆధీనంలోకి జామియా మసీదు తీసుకున్నట్లు అందులో పేర్కొన్నారు. అయితే మసీదు నిర్మాణం యథావిధిగా కొనసాగుతుందని, కానీ కమిటీకి ఇకపై ఎలాంటి అధికారాలు ఉండవన్నారు. మసీదు నిర్మాణం, అభివృద్ధికి అవసరమైన చందాలు, వితరణలు నోటీసులో పేర్కొన్న బ్యాంకు ఖాతా లేదా వక్ఫ్‌బోర్డు ఖాతాకు జమ చేయాలని, రశీదులను తప్పనిసరిగా పొందాలని స్పష్టం చేశారు. కాగా.. అక్టోబర్ 17న జామియా మసీదు పునర్నిర్మాణానికి శంకుస్థాపన జరిగిన సంగతి తెలిసిందే.

ప్రజా రవాణా వ్యవస్థ జాతీయ క్రీడా పోటీలకు అంతా సిద్ధం

కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానం వేదికగా నేటి నుంచి నిర్వహణ



పరేడ్ రిహార్సల్స్ చేస్తున్న రోడ్డు రవాణా సంస్థల ఉద్యోగులు

ఆరిలోవ: ప్రజా రవాణా వ్యవస్థ ఉద్యోగుల క్రీడా సంబరాలకు కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానం సిద్ధమైంది. అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్(ఏఎస్ఆర్‌టీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జాతీయ స్థాయి పోటీలు జరగనున్నాయి. దేశంలోని అన్ని రాష్ట్రాల రోడ్డు రవాణా సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు, అధికారులు ఇప్పటికే క్రీడా మైదానానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయా రాష్ట్రాల ఉద్యోగులు గురువారం పరేడ్ రిహార్సల్స్ చేశారు. కాగా.. ఏపీఎస్ఆర్టీసీ నుంచి 49 మంది, ఏఎస్‌సీడీసీఎల్ నుంచి 10 , బీఎంటీసీ నుంచి 31, బెస్ట్ నుంచి 12, డీటీసీ నుంచి 27, జీఎస్ఆర్టీసీ నుంచి 24, కేకేఆర్టీసీ నుంచి 32, కర్ణాటక ఎస్ఆర్టీసీ నుంచి 39, ఎంఎస్ఆర్టీసీ నుంచి 17, ఎంటీసీ(చెన్నై) నుంచి 22, ఎన్‌డబ్ల్యూకేఆర్టీసీ నుంచి 33, ఎస్ఈటీసీ(తమిళనాడు) నుంచి ఇద్దరు, టీఎన్ఎస్‌టీసీ(సాలేం) నుంచి 5, టీఎన్ఎస్‌టీసీ(తిరునల్వేలి) ఒకరు, టీఎన్ఎస్‌టీసీ(విల్లుపురం) నుంచి 5, టీఎస్ఆర్టీసీ నుంచి 32, యూపీఎస్ఆర్టీసీ నుంచి 17, ఉత్తరాఖండ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ నుంచి 24 మంది క్రీడాకారులు పోటీల్లో తలపడనున్నారు. వీరికి 100, 200, 400, 800, 1500 మీటర్ల పరుగు పందెం, 400 మీటర్ల రిలే, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, లాంగ్ జంప్, 50 ఏళ్లలోపు సూపర్‌వైజర్లకు 100 మీటర్ల పరుగు పందెం, 50 ఏళ్ల పైబడిన సూపర్‌వైజర్లకు 1000 మీటర్ల ఫాస్ట్ వాక్, 50 ఏళ్ల పైబడిన అధికారులకు 400 మీటర్ల ఫాస్ట్ వాక్, 50 ఏళ్లలోపు అధికారులకు 1000 మీటర్ల ఫాస్ట్‌వాక్ పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చైర్మన్ కె.నారాయణ శుక్రవారం ఉదయం 9 గంటలకు ఈ పోటీలు ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు.

ముగిసిన ధనాధన్ క్రికెట్

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ గ్రూప్ డీ నుంచి నాకవుట్‌కు విదర్భ

విశాఖ స్పోర్ట్స్: విశాఖ వేదికగా జరుగుతున్న సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ గ్రూప్ డీ పోటీలు గురువారంతో ముగిశాయి. వైఎస్సార్ స్టేడియంలో చివరి రోజు జరిగిన పోటీల్లో పుదుచ్చేరిపై రైల్వేస్ ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. డేనైట్ మ్యాచ్‌లో అసోంపై చత్తీస్‌గఢ్ 124 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. దీంతో గ్రూప్‌లో విదర్భ 18 పాయింట్లతో నేరుగా నాకవుట్‌కు చేరింది. చండీగఢ్ 16 పాయింట్లతో, రైల్వేస్ 14, అసోం 12, చత్తీస్‌గఢ్ 10, పుదుచ్చేరి 8, ఒడిశా ఆరు పాయింట్లు సాధించి లీగ్ దశ పోటీలు ముగించాయి.

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన పుదుచ్చేరి ఎనిమిది వికెట్లకు 175 పరుగులు చేసింది. ఆకాష్ 58 పరుగులు చేశాడు. కునాల్ మూడు వికెట్లు తీశాడు. ప్రతిగా 13.3 ఓవర్లలోనే రైల్వేస్ విజయం సాధించింది. కెప్టెన్ ఉపేంద్ర దకౌట్‌గానే వెనుదిరగ్గా.. 70 పరుగులకే నాలుగు వికెట్లు జట్టు కష్టాల్లోపడింది. ఈ క్రమంలో ఐదో వికెట్‌కు రవిసింగ్(56), అశుతోష్ (50) జోడీ రాణించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. మరో మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన చత్తీస్‌గఢ్ ఏడు వికెట్లు కోల్పోయి 203 పరుగులు చేసింది. అశుతోష్(47), అజయ్ (46) మిడిలార్డర్‌లో ఇన్నింగ్స్ చక్కదిద్ది భారీ స్కోర్ దిశగా నడిపించారు. ప్రతిగా అసోం 79 పరుగులకే ఆలౌటైంది. ఆశిష్ రెండు వికెట్లు తీయగా, అజయ్ ఐదుగురిని పెవిలియన్‌కు పంపి జట్టుకు విజయాన్నందించాడు.

అప్పన్న సన్నిధిలో సీఎస్ నీరబ్‌కుమార్



చీఫ్ సెక్రటరీకి జ్ఞాపికను అందజేస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ గురువారం దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామివారికి అష్టోత్తర పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం, జ్ఞాపికను ఏఈవో ఆనంద్‌కుమార్ అందించారు.



బోటు షికారు పునఃప్రారంభం

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో బోటు షికారు గురువారం పునఃప్రారంభమైనట్లు నిర్వాహకులు తెలిపారు. తుపాను నేపథ్యంలో గత వారం రోజుల నుంచి అలల ఉధృతి, తీరంలో ఈదురు గాలుల ప్రభావంతో బోటు షికారును నిలిపి వేశారు. వాతావరణం అనుకూలంగా మారడంతో బోటు షికారును ప్రారంభించినట్లు తెలిపారు.

కనకమహాలక్ష్మి బ్యాంకు నూతన శాఖ ప్రారంభం



విశాలాక్షినగర్‌లో కనకమహాలక్ష్మి బ్యాంకు బ్రాంచిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

సీతంపేట: అన్ని రంగాల వారికి సహకారం అందించే దిశగా కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. విశాలాక్షినగర్‌లో కనకమహాలక్ష్మి బ్యాంక్ 33వ శాఖను గురువారం ఆయన ప్రారంభించారు. బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ బ్యాంకు మల్టీ స్టేట్ హోదా సాధించే దిశగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రస్తుతం తమ బ్యాంకు రూ. 910 కోట్ల డిపాజిట్లు, రూ.630 కోట్లు రుణాల మంజూరుతో రూ.1,530 కోట్ల వ్యాపారాన్ని సాగిస్తున్నట్టు పేర్కొన్నారు. 2025 మార్చి నాటికి వెయ్యి కోట్లు డిపాజిట్లు చేరుకోవడంతోపాటు రూ.1,800 కోట్ల వ్యాపార లక్ష్య సాధనకు కృషి చేస్తున్నామన్నారు. 9 జిల్లాల్లో 33 శాఖలను ఏర్పాటు చేశామని, మార్చి నాటికి మరో 5 శాఖలు ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్ర సహకార అర్బన్ బ్యాంకుల అధ్యక్షుడు చిట్టూరి రవీంద్ర, నాఫ్కాబ్ డైరెక్టర్ చలసాని రాఘవేంద్రరావు, మహారాజా కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎం.ఆర్.కె.రాజు, హిందూస్థాన్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, దయాల్‌కాలనీ కార్యదర్శి రాజేష్ ఇందల, విశాలాక్షినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరెడ్డి, బ్యాంకు ఉపాధ్యక్షుడు జి.రామకృష్ణ, పాలకవర్గం సభ్యులు, బ్యాంకు సీఈవో కె.శ్యామ్‌కిషోర్, బ్రాంచి మేనేజర్ పి.ప్రసాద్ పాల్గొన్నారు.